

చదువుకోండమ్మా: హోం వర్క్ చేయిస్తున్న తల్లి రజిత

త్వరత్వరగా: కొడుకుకు స్నానం చేయిస్తున్న సంధ్య

గుడ్ మార్నింగ్: పొద్దున్నే నిద్రలేస్తున్న తనీశ్, హన్సిక

న్యూస్‌రీల్

మోదీ పాలనలో అభివృద్ధి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రావణి

జగిత్యాలరూరల్: ప్రధానమంత్రి మోదీ తొమ్మిదేళ్ల పాలనలో కులమతాలకతీతంగా దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన సందర్భంగా మహా జన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శనివారం అనంతారంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మహిళల ఆత్మాభిమానం కోసం ఇంటింటికీ మరుగుదొడ్లు, గ్యాస్ కనెక్షన్లు, బేటీ బచావో, బేటీ పడావో, సుకన్య యోజన వంటి పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఫసల్ బీమా యోజనతో రైతులను ఆదుకుంటున్నారని అన్నారు. నాయకులు ఎడ్మల శైలేందర్‌రెడ్డి, నలువాల తిరుపతి, సాంబారి కళావతి, జీవన్, శ్రీకాంత్, తిరుపతి, కల్యాణ్, మల్లేశం, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

డ్రైవర్‌బంధు ప్రవేశ పెట్టాలి



సభ్యులను సన్మానిస్తున్న శివలాల్‌నాయక్

రాయికల్(జగిత్యాల): డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం డ్రైవర్‌బంధు పథకం ప్రవేశ పెట్టాలని నవయుగ తెలంగాణ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో జరిగిన డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవనభృతి, ఇన్సూరెన్స్, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పాషా, జనరల్ సెక్రటరీ రంగు సంపత్, మండల అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: సమస్యలు పరిష్కరించాలంటూ టీఎన్జీవో నాయకులు శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరిస్తామని శశిధర్ వారికి ఈసందర్భంగా హామీ ఇచ్చారు.

సండే స్పెషల్

అమ్మే ఆది గురువు

- పిల్లల చదువుల వెనక తల్లి శ్రమే ఎక్కువ
- నిద్రలేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు..
- ఆలనలో అగ్రభాగం అమ్మే..
- హోంవర్క్‌లో పూర్తి భాగస్వామ్యం

లే నాన్నా.. స్కూల్‌కు టైం అవుతోంది.. త్వరగా రెడీ కావాలంటూ.. దుప్పట్లోంచి పిల్లల్ని బుజాలపై ఎత్తుకెళ్లి బ్రష్ చేయించి.. స్నానం పోస్తుంది. స్కూల్ యూనిఫాం తొడిగి.. టిఫిన్ తినిపించి.. లంచ్‌బాక్స్, బుక్స్‌ను బ్యాగులో సర్దుతుంది. గేటు బయటివరకూ తీసుకెళ్లి బడికి పంపిస్తుంది. పిల్లలు సాయంత్రం వచ్చేసరికి స్నాక్స్ సిద్ధం చేస్తుంది. వారు ఆడుకుంటుంటే స్నేహితురాలిగా.. హోంవర్క్‌లో టీచర్‌గా మారుతుంది. అలిసిపోయిన పిల్లలకు మళ్లీ అన్నం తినిపించి గుండెలపై పడుకోబెట్టుకుని అప్పుడు నిద్రపోతుంది అమ్మ.

పిల్లలను స్కూల్‌కు పంపించడం అంత సులువేం కాదు. కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లు చకచకా పిల్లల్ని సిద్ధం చేస్తేనే వారు సమయానికి పాఠశాలకు వెళ్తారు. కొంచెం పెద్దవాళ్లయితే పర్లేదుగానీ.. 5– 10ఏళ్ల వారిని రెడీ చేయడం తల్లులకు నిత్యం ఒక టాస్క్. గృహిణులకు కొంత ఉపశమనం ఉంటున్నా.. ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లేవారు పోటీ పడాల్సిందే.

వేకువజాము నుంచే..

తల్లులకు వేకువజాము మేల్కొనడంతోనే పనులు మొదలవుతాయి. ఇంటి పనులు త్వరగా పూర్తి చేసి.. పిల్లలకు నీళ్లు వేడి చేయడం.. స్నానాలు చేయించడం, దుస్తులు వేయడం, టై, బెల్టు పెట్టడంతోపాటు పలక, బలపం బ్యాగులో సర్దడం కూడా తల్లులే చేస్తున్నారు. పిల్లలు చిన్నవాళ్లు అయితే పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు బ్యాగులో ఉన్నాయా..? లేవా..? పెన్సిల్ వంటివి సరిచూసి బ్యాగు సిద్ధం చేయడం కూడా తల్లుల వంతే. వారు పాఠశాలకు వెళ్లాక దుస్తులు శుభ్రం చేయడం నుంచి దుస్తులు ఇస్త్రీ చేయడం వరకు తల్లులే బాధ్యత తీసుకుంటున్నారు. చివరకు చుట్టాలు, ఇరుగు పొరుగు వారిని ఏయే వరుసలతో పిలవాలో నేర్పించేది తల్లే. పిల్లలకు ముందుగా వచ్చీరాని మాటల దగ్గర నుంచి మొదలుకొని సంస్కారవంతమైన చక్కటి అలవాట్లను నేర్పించడంలో తల్లి పాత్ర కీలకం.

ప్రతిరోజూ హోంవర్క్

పిల్లలు సాయంత్రం ఇంటికి చేరుకున్నాక వారితో హోంవర్క్ చేయించేది కూడా తల్లే. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలను ఒడిలో కూర్చోబెట్టుకొని హోంవర్క్ చేయిస్తున్నారు. సతాయిస్తున్నా.. సముదాయిస్తూ వారితో హోంవర్క్ పూర్తి చేయిస్తారు. పిల్లలు పెద్దవారైతే వారిని ట్యూషన్‌కు పంపించడం.. రాగానే ఏం చెప్పారో తెలుసుకోవడం.. పాలు తాగించడం.. ఇలా వారు నిద్రపోయే వరకూ అన్నీ తల్లే చూసుకుంటోంది.

తల్లికి సముచిత స్థానం

పిల్లల చదువుల్లో తల్లుల పాత్ర పెరగడంతో ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయిలోనూ తండ్రి పేరుతోపాటు తల్లి పేరు కూడా ఫారాల్లో రాయాల్సిందిగా నిబంధనలు పెట్టారు. కొన్ని పాఠశాలల్లో తల్లుల పేర్లు, ఫోన్ నంబర్లను కూడా తీసుకుంటున్నారు. మాతృమూర్తి ప్రథమ గురువు అని చెప్పడమే కాదు, అక్షరసత్యం.



హర్షినికి జడ వేస్తున్న రూప్సీ

తినునాన్నా: కొడుకుకు టిఫిన్ తినిపిస్తున్న శిల్ప

నడుచ్.. నడుచ్: కూతురుకు బ్యాగ్ వేస్తున్న హారిక

బైబై: స్కూల్‌కు వెళ్తున్న చిన్నారి

చలోచలో: పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్తున్న తల్లి

క్రమశిక్షణ అలవడుతుంది



పిల్లలకు ఇంటి వద్ద క్రమశిక్షణ నేర్పిస్తాం. మేం చేసే అలవాట్లే వారిని సరైన దారిలో పెట్టేందుకు ఉపయోగపడతాయి. మా పాప సహస్ర 6వ తరగతి చదువుతోంది. ప్రతి రోజు యూనిఫాంతోనే స్కూల్‌కు అటెండ్ అవుతుంది. అందుకు తగ్గట్టే నేను కూడా పాపను రెడీ చేస్తాను. రెండు జడలు వేయాలంటే 10 మార్కుల జవాబు రాయాల్సినంతా పని అవుతుంది. అయినా రెండు జడలు వేసి పంపిస్తాను. – కన్న శ్వేత, డాక్టర్ స్ట్రీట్

పిల్లలకంటే గంట ముందుగానే



మా పాప మేఘన అల్లునూర్‌లోని స్కూల్‌లో యూకేజీ చదువుతోంది. పిల్లల కంటే గంట ముందుగానే లేచి ఇంట్లో పని మొత్తం చేసుకుంటాను. పాప లేచాక స్కూల్‌లో దింపి వచ్చేవరకు ఏ పని చేయను. పిల్లలను లేపడం స్నానం చేయించి రెడీ చేయడం పెద్దపని. ఆ పనులు అయిపోతే మిగిలిన పనులు సులువుగా చేసుకోవచ్చు. – పంబాలు సంధ్య, అల్లునూర్

మేమే బడికి పోయినంత పని



మేం బోయవాడలో ఉంటాం. మా పాప రూప కొత్తపల్లిలోని స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ప్రతిరోజు కమాన్ వరకు బైక్‌పై డ్రాప్ చేసి స్కూల్ బస్సు ఎక్కించి వస్తాను. పాప ఉదయం లేచినప్పటి నుంచి బస్ ఎక్కించేంత వరకు బిజీబిజీగా ఉంటుంది. మళ్లీ సాయంత్రం బస్సు కోసం వెయిట్ చేసి ఇంటికి తీసుకొస్తాను. ప్రస్తుత కాలంలో తల్లులే బడికి పోయినంత పని అవుతుంది.

– చకిలం స్వప్న, బోయవాడ

పిల్లల తరువాతే అందరూ



పిల్లలను బడికి పంపించడమే ఫస్ట్.. తర్వాతనే మిగిలివారు. వాళ్లను రెడీ చేసి బడికి పంపిస్తా. లంచ్ బ్రేక్‌కు టిఫిన్ రెడీ చేసి స్కూల్‌కు వెళ్లి తినిపించి వస్తా. నేను లంచ్ చేసే వరకు స్కూల్ టైం అయిపోతుంది. మళ్లీ స్కూల్‌కు వెళ్లి పాపను తీసుకొస్తాను. ఇలా రోజు గడుస్తుంది. మా పాప అల్లునూర్‌లో ఎల్‌కేజీ చదువుతోంది. – అట్ల మమత, అల్లునూర్

– సప్తగిరికాలనీ(కరీంనగర్), ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పేదలకు నాణ్యమైన వైద్యసేవలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్ ద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ప్రస్తుతం అందుతున్న 57రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను 134కు పెంచారు. వీటిని మంత్రి హరీశ్‌రావు శనివారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 16 రేడియాలజీ ల్యాబ్‌లు మంజూరు కాగా, జగిత్యాలకు ఒకటి కేటాయించారని, 8 క్రిటికల్ కేర్ యూనిట్లు మంజూరు కాగా, అందులో ఒకటి జగిత్యాలకు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 350 పడకల ఆస్పత్రిని త్వరలో 600 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తారని చెప్పారు. మాతాశిశు సంక్షేమ కేంద్రంలో అవుట్ పేషెంట్ల సంఖ్య తగ్గిందని, ప్రతిపక్ష నాయకులు అసత్యపు ప్రచారంతో ఇలా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని విమర్శించారు. ప్రస్తుతం ఇక్కడ కంటి శస్త్రచికిత్సలు కూడా ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ప్రతీఒక్కరు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అదనపు కలెక్టర్ మకరంద్, డీఎంహెచ్‌వో శ్రీధర్, సూపరింటెండెంట్ రాములు తదితరులు పాల్గొన్నారు.



కిట్లు అందిస్తున్న సంజయ్‌కుమార్, యాస్మిన్‌బాషా

జెడ్పీ హైస్కూల్ సందర్శన

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలం కొండాపూర్ జెడ్పీ హైస్కూల్‌ను నాబార్డ్ అధికారులు శనివారం సందర్శించారు. నాబార్డ్ నిధులతో పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్, టీవీలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వసతులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

అభివృద్ధి పనులకు పెద్దపీట

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి(ధర్మపురి): అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గోవిందుపల్లి, గుజంపడుగు గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. టీఆర్‌ఎస్ పాలనలో పల్లెలకు మహర్దశ పట్టిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం రమేశ్, ముస్కు శంకరవ్వ, ప్రొక్లెస్ మల్లారెడ్డి, తూర్పాటి రాజ్యలక్ష్మి, గోస్కుల జలేందర్, నక్క శంకర్, ఆవుల సత్యం, కాంపెల్లి హన్మండ్లు, సుంకుసాని రాజసుమన్‌రావు, వెంకటమాధవరావు, నవ్వ తిరుపతి, తూర్పాటి అంజి పాల్గొన్నారు.



భవనం ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

లండన్‌లో బోనాలు

రాయికల్(జగిత్యాల): తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్(టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో శనివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. పోచమ్మ, గంగమ్మ, మైసమ్మ తదితర దేవతామూర్తులకు బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యూకేలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 1,200 మంది ఒకచోట హాజరై తెలంగాణ ఆచారం ప్రకారం బోనాలతో వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. దారిపొడవునా పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. హౌన్స్లో మేయర్ కియానీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టాక్ అధ్యక్షుడు కడుతుల రత్నాకర్, ఉపాధ్యక్షుడు సుష్మణరెడ్డి, సంయుక్త కార్యదర్శి సతీశ్‌రెడ్డి, నాయకులు జాహ్నవి, హరిగౌడ్, రాకేశ్ పటేల్, సత్య, శ్రీకాంత్, క్రాంతి, శ్వేత, నవీన్‌రెడ్డి, మల్లారెడ్డి, రాకేశ్‌పటేల్, మౌనిక పాల్గొన్నారు.



బోనాలతో చేపట్టిన ఊరేగింపులో ప్రతినిధులు



జగిత్యాల : అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



జగిత్యాలలోని పరీక్ష కేంద్రం వద్ద కలెక్టర్ యాస్మిన్ బాషా





జగిత్యాలలోని పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, కోరుట్లలో అభ్యర్థుల తనిఖీ









హాల్‌టికెట్ నంబర్లు సరిచూస్తూ.. కొండగట్టులో.. రెండు నెలల పాపతో, రాయికల్‌లో తండ్రితో, మహిళ వద్ద శిశువు

ప్రశాంతంగా గ్రూప్‌–4 పరీక్ష

జగిత్యాల/జగిత్యాలక్రైం/రాయికల్/కొండగట్టు/కోరుట్ల: జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన గ్రూప్‌–4 పరీక్షకు 83శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 73 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 21,937 మంది పరీక్షకు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. అయితే, ఉదయం జరిగిన పేపర్‌–1 పరీక్షకు 18,278 మంది హాజరుకాగా, 3,658 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్‌–2 పరీక్షకు 18,213 మంది హాజరుకాగా 3,724 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ యాస్మిన్ బాషా పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎస్పీ భాస్కర్ బందోబస్తు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

అష్టలక్ష్మి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న జడ్జి నారాయణ

కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మి దేవాలయంలో జిల్లా కోర్టు అదనపు జడ్జి ఎస్.నారాయణ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు జడ్జికి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల కోర్టు జడ్జి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.3కోట్లు


రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల

కోరుట్ల: పట్టణంలోని కీలకమైన రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడానికి రూ.3.55 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు. గాంధీ రోడ్డులో బీటిగా మార్చుతున్న పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. చాకలి అయిలమ్మ విగ్రహం, ఝాన్సీరోడ్డు, టీచర్స్ క్లబ్ రోడ్డు, గడి బురుజు రోడ్డు, శ్రీవేంకటేశ్వర టెంపుల్ వరకు బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ ఆయాజ్, డీఈ అభినయ్, బీఆర్ఎస్ నాయకులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, ఎంబేరి నాగభూషణం, గంధం గంగాధర్, మోర్తాడ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కాగా, గాంధీరోడ్డులో వ్యాపార సముదాయాల్లోని ప్రతీ దుఖానికి వెళ్లిన ఎమ్మెల్యే.. ఒక్కొక్కరిని కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకని నిధులు మంజూరు చేస్తామని చెప్పారు.

డైరెక్టర్‌కు సన్మానం


సన్మానిస్తున్న నాయకులు

రాయికల్(జగిత్యాల): స్థానిక మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన ఎనగందుల రమేశ్‌ను శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్కం రాజేశ్, కోరుట్ల మండల అధ్యక్షుడు బూసం సతీశ్, పోచమల్లు గంగాధర్ ఘనంగా సన్మానించారు. రాజేశ్ మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి చిలువేరి వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి ఇప్పరి గంగాధర్, నాయకులు లింగం శ్రీనివాస్, మనోజ్, సిర్ప సంతోష్, లక్ష్మీనారాయణ, రంజిత్, పవన్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ భర్తపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాంతానికి చెందిన చుక్క వెంకట్‌రాములు ఫిర్యాదు మేరకు కౌన్సిలర్ భర్తపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విద్యానగర్ ప్రాంతానికి చెందిన చుక్క వెంకట్‌రాములుకు మోతె శివారులో 4.22 ఎకరాల భూమి ఉంది. దీనిని కౌన్సిలర్ అడువాల జ్యోతికి 2020 అక్టోబరు 18న విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నారు. దానిప్రకారం జ్యోతి డబ్బులు చెల్లించలేదు. భూమి రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. దీంతో 2023 జూన్ 15న అడువాల జ్యోతి భర్త లక్ష్మణ్.. వెంకట్‌రాములు ఇంటికి వెళ్లాడు. తెల్లపేపర్‌తోపాటు, రూ.100 విలువైన బాండ్ పేపర్‌పై సంతకం పెట్టాలని వెంకట్‌రాములుపై ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు వెంకట్‌రాములు నిరాకరించాడు. జూన్ 16న మరోసారి వెంకట్‌రాములు ఇంట్లోకి అక్రమంగా చొరబడిన లక్ష్మణ్.. 'నువ్వు భూమి విక్రయించకున్నా, ఒప్పందపత్రంపై మళ్లీ సంతకం చేయకపోయినా.. నిన్ను.. నీ కుటుంబాన్ని చంపేస్తామని' బెదిరించాడు. దీంతోపాటు, మున్సిపల్‌లో పనిచేసే ఎస్సీ, ఎస్టీ క్లీనింగ్ వర్కర్ చేత ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయిస్తానని హెచ్చరించాడు. అంతటితో ఆగకుండా ఇంట్లోని ప్రాపర్టీస్‌ను ధ్వంసం చేశాడు. బాధితుడు వెంకట్‌రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అడువాల లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడు మృతి


పెద్దనర్సయ్య(ఫైల్)

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వేములకుర్తి గ్రామానికి చెందిన బక్కి పెద్దనర్సయ్య (65) చేపలు పట్టేందుకు గోదావరి నదికి వెళ్లగా వలలో చిక్కుకొని మృతిచెందినట్లు పోలీసులు శనివారం తెలిపారు. శుక్రవారం చేపలు పట్టేందుకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గోదావరి నదిలో చేపలు పడుతుండగా..బండ కింద చెయ్యి ఇరుక్కుంది. ఆ క్రమంలోనే వలలో ఇరుక్కుపోయాడు. బయటకు రాలేక ఊపిరి ఆడక మృతిచెందాడు. రాత్రి వరకూ ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు శనివారం గోదావరి నదికి వెళ్లి చూడగా..అందులో మృతిచెంది ఉన్నట్లు కనిపించాడు. మృతుడి కుమారుడు వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్దనర్సయ్య మృతితో విషాదం నెలకొంది.

సండే స్పెషల్

రుద్రంగి.. వస్తోంది

రుద్రంగి రక్తచరిత్రకు సాక్ష్యం. నిత్య కల్లోలంతో పిడికెడు మట్టిని పిసికితే చారెడు కన్నీళ్లు రాలిన నేల. రాత్రయితే చాలు.. బిక్కుబిక్కుమంటూ గడిపిన క్షణాలు.. ఇక్కడ పెరిగిన చెట్టుకు.. ఎగిరే పిట్టకు.. పుట్టకు.. గుట్టకు.. కన్నీటి కథలు తెలుసు.. తుపాకీ మోతలు.. గాలిలో కలిసే ప్రాణాలు.. ఇందిరమ్మ బొమ్మ సాక్షిగా తలను వేరు చేయబడిన మొండెం కళ్ల ముందు కనిపించిన దృశ్యం.. అణచివేత... తిరుగుబాటుకు సాక్ష్యం రుద్రంగి. ఊరు పెద్దదే అయినా.. దొరలు, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి చిత్రరూపమిస్తూ.. రుద్రంగి సినిమా రూపుదిద్దుకుంది. ఈ నెల 7న విడుదల కాబోతున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ప్రేక్షకుల ముందుకు రాబోతున్న రుద్రంగి సినిమాపై 'సాక్షి' ఈ వారం సండే స్పెషల్.. – సిరిసిల్ల


నక్సలైట్లు ఇన్‌ఫార్మర్‌గా భావించి లక్ష్మి అనే మహిళ తల నరికి వేలాడదీసిన రుద్రంగి చౌరస్తా ఇదే..

- గాయాల ముల్లె.. ఆ పల్లె
- వెండితెరపై కల్లోల పల్లె కథ
- ఈనెల 7న విడుదల



ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో బాలకృష్ణ, జగపతిబాబు, రసమయి బాలకిషన్


రుద్రంగి సినిమాలోని ఓ సన్నివేశం

దాడులు.. ప్రతిదాడులు

మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి రుద్రంగి స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో నక్సలైట్లు, పోలీసుల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో ప్రభుత్వం శాంతిచర్చలు జరిపింది. ఈ చర్చలు ముగియగానే శాంతిని భగ్నం చేస్తూ ఎదురుకాల్పులు జరిగింది ఇక్కడే. మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు. అంతకుముందు కొచ్చెగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు జనశక్తి నక్సలైట్లు మరణించారు. రుద్రంగి శివారులోని లింగంపేట వద్ద నక్సలైట్లు పేల్చిన మందుపాతరకు చందుర్తి ఎస్సై శ్రీనివాస్‌రావు మృత్యువాత పడ్డారు. చందుర్తి ఎంపీపీ గంగరాజంను నక్సలైట్లు ఇన్‌ఫార్మర్‌గా పేర్కొంటూ రుద్రంగిలో కాల్చిచంపారు. అంతకుముందు లక్ష్మి అనే మహిళను ఇన్‌ఫార్మర్ నెపంతో తల నరికి ఇందిరమ్మ విగ్రహానికి కట్టిన ఘటన అప్పట్లో సంచలనం. దాడులు, ప్రతిదాడులతో ఆ రుద్రంగి కన్నీటి ధారగా మారింది. పక్కనే దట్టమైన అడవి ఉన్న మానాల, మరిమడ్ల, వట్టిమల్ల, కలికోట, అంబారిపేట గిరిజనతండా, కొత్తపేట, లింగంపేట చుట్టూ ఊర్లతో రుద్రంగి కల్లోలమైంది. రుద్రంగిలో కొండాపూర్ ఎన్‌కౌంటర్ మృతుల పేరుతో జనశక్తి అమరవీరుల స్తూపం ఉంది. ఆ ఊరిపై ఉద్యమ గీతాలెన్నో జనబాహుళ్యంలోకి వెళ్లాయి.

ఎగిసి పడిన ఉద్యమాల ఖిల్లా

రుద్రంగి సలుపుతున్న గాయాలముల్లె. వలపోతల కన్నీటిధార. 1975 దశకంలో ఎగిసిపడిన నక్సలైట్ ఉద్యమ కెరటం. చుక్కనీరు దొరకని దైన్యం. నిరుద్యోగం నిచ్చెన మెట్లతో గల్ఫ్ దేశాలకు వలసపోయిన బతుకులు. భూస్వామ్యపు అణచివేతలు.. చుట్టూరా ఎత్తయిన గుట్టలు.. గుట్ట కింద కుప్ప పోసిన ట్లుగా ఉండే ఇళ్లు. అందులో తాతల నాటి పెంకుటిండ్లే ఎక్కువగా కనిపిస్తాయి. గల్ఫ్ సిరులు తెచ్చిన బిల్డింగులు.. పదిహేను వేల జనాభాతో ఉన్న ఆ పల్లె రుద్రంగిగా వెండితెర కెక్కింది. రుద్రంగి ఒకప్పుడు సిరిసిల్ల నియోజకవర్గంలో పెద్ద ఊరు. నేడు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ నియోజకవర్గంలో ఓ మండల కేంద్రం. పసుపు, వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో ఆ పల్లె ఇప్పుడు పసిడి రాశులతో కళకళలాడుతోంది.



నిర్మాత మనోడే..

రుద్రంగి పేరుతో వస్తున్న ఈ సినిమాను 1960–90 ప్రాంతంలో జరిగిన సంఘటనలు, భూస్వామ్య వ్యవస్థ నేపథ్యంలో చిత్రీకరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఈ చిత్రానికి నిర్మాత కాగా, అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహిస్తున్నారు. జగపతిబాబు, ఆశీష్‌గాంధీ, విమలారామన్, మమతా మోహన్‌దాస్ ప్రధాన పాత్రల్లో ఈ సినిమా రూపుదిద్దుకుంది. బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలకు రైటర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న అజయ్‌సామ్రాట్ దర్శకుడు కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. 'రుద్రంగి నాది.. రుద్రంగి బిలాంగ్స్ టు మి' అంటూ జగపతిబాబు చెప్పే డైలాగ్ గంభీరంగా ఉంది. జాలి, దయ లేని భీమ్‌రావు దొరగా జగపతిబాబు నటిస్తున్నారు. మొత్తానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో అనేక ప్రత్యేకతలు ఉన్న మేజర్ గ్రామం రుద్రంగిని వెండితెరకు ఎక్కించడం విశేషం. ఆ సినిమా ఎలా ఉంటుంది.. రుద్రంగి టైటిల్‌తో ఏం చెబుతారో అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఈనెల 7న విడుదలకు సిద్ధమైంది. ఇటీవల ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ హీరో బాలకృష్ణ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సిరిసిల్లకు చెందిన వెల్దండి వేణు దర్శకత్వంలో ఇటీవల వచ్చిన 'బలగం' సినిమా విజయవంతం కాగా.. రాజన్న సిరిసిల్ల జిల్లా నేపథ్యంలో మరో సినిమా 'రుద్రంగి' వెండితెరపైకి రావడం విశేషం.

మా ఊరిలో నేను ఒక్కడినే నటించాను



మా సొంతూరు రుద్రంగి. మా ఊరి పేరుతో వస్తున్న సినిమాలో నాకు నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాపై మా ఊరి అందరిలో ఆసక్తి పెరిగింది. మరో ఐదు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రుద్రంగి రాబోతుంది. ఆ సినిమాను వెండి తెరపై చూస్తేనే ఆసక్తిగా ఉంటుంది.

– తోకల తిరుమల్, రుద్రంగి యువకుడు

గ్రూప్ -4 అభ్యర్థులకు సేవలు


అరటిపండ్లు, జ్యూస్, బిస్కట్లు అందిస్తున్న సభ్యులు

కోరుట్ల: పట్టణంలో గ్రూప్-4 అభ్యర్థులకు మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థతోపాటు జామే మసీదు కమిటీ సభ్యులు సేవలు అందించి ప్రశంసలు పొందారు. బస్టాండ్ సమీపంలో గ్రూప్- 4 అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల చిరునామా కోసం ఇబ్బందులు పడకుండా మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ సభ్యులు ప్రత్యేక కేంద్రం ఏర్పాట్లు చేశారు. బస్సులు దిగిన వెంటనే అభ్యర్థులకు సలహాలు అందించారు. దీంతోపాటు రెండు కార్లు, నాలుగు మోటార్ సైకిళ్లు అందుబాటులోకి తెచ్చి పరీక్ష కేంద్రాలు దూరంగా ఉన్న అభ్యర్థులను తీసుకెళ్లి దిగబెట్టారు. మధ్యాహ్నం పరీక్ష విరామ సమయంలో అరటిపండ్లు, బిస్కెట్లు, జ్యూస్‌పాకెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే అధ్యక్షుడు నసీరొద్దీన్, కార్యదర్శి అమ్జద్ అలీ, జామే మసీదు కమిటీ అధ్యక్షుడు ఎంఏ అథర్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు అస్రార్, ఉపాధ్యక్షుడు మసీయొద్దీన్, కోశాధికారి నజీమొద్దీన్, జబ్బార్ యూత్ ప్రెసిడెంట్ మహ్మద్ తఖీయొద్దీన్, జావీద్‌అలీ, లతీఫ్, ఇలియాస్, వహీద్, అలీం, బదర్, అవేజ్, జునేద్, ముబీన్, మిన్హాజ్, సుల్తాన్, నజీర్, అర్షద్, సబుర్, యాసిర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు పట్టని ప్రభుత్వం


జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళా కాంగ్రెస్ శ్రేణులు

- నిత్యావసరాల ధరలు నియంత్రించాలి
- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్

జగిత్యాలటౌన్: నిత్యావసరాల ధరల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి విమర్శించారు. అఖిలభారత మహిళా కాంగ్రెస్ పిలుపు మేరకు కూరగాయలు, నిత్యావసరాల ధరల పెంపును నిరసిస్తూ స్థానిక తహసీల్ చౌరస్తాలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. విజయలక్ష్మి మాట్లాడుతూ మహారాష్ట్రకు 600 కార్లలో ప్రచారానికి వెళ్లి రావడానికి సీఎం కేసీఆర్‌కు సమయం ఉంటుంది కానీ ఓట్లేసి గెలిపించిన రాష్ట్ర ప్రజల కష్టాలు చూసే తీరిక లేకపోవడం బాధాకరమన్నారు. అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినా పరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో రేషన్ షాపుల ద్వారా 9 రకాల నిత్యావసరాలు పంపిణీ చేశామని గుర్తుచేశారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలను పట్టించుకునే తీరికలేని సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లాల సరిత, చిట్ల లత, నాగిరెడ్డి రజిత, లత, రూప, సౌజన్య, కల్లెపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, మన్సూర్, ముంజాల రఘువీర్‌గౌడ్, రియాజ్, సంతోష్, గోలి శేఖర్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'హామీలు విస్మరించిన ప్రభుత్వం'


మాట్లాడుతున్న తుల ఉమ, నాయకులు

కథలాపూర్: పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ కోరారు. శనివారం గంభీర్‌పూర్ గ్రామంలో గడప గడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. 9 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి, ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసిందని మండిపడ్డారు. బీడీలు తయారుచేసే ప్రతీ కార్మికురాలికి జీవనభృతి ఇస్తామని నాలుగేళ్లుగా అమలు చేయడకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గట్ల అంజయ్య, దాసరి జలేందర్, కొట్టూరి నాగేశ్, సాయికృష్ణ, రఘు, జనార్దన్, లింబాద్రి, ప్రసాద్, మహేశ్ పాల్గొన్నారు.

తాగునీటికి తపిస్తున్న పల్లెలు


మంచినీటిబావి పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): మిషన్ భగీరథ పథకం అమలు చేస్తున్నా జిల్లాలోని పల్లెలు తాగునీటికి తపిస్తున్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. బీర్‌పూర్ మండలం రేకులపల్లి, కొల్వాయి, తుంగూర్, నర్సింహులపల్లె, బీర్‌పూర్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు అందడం లేదని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన పర్యటించారు. అనంతరం సారంగాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెట్‌పల్లి మండలం డబ్బా నుంచి జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలకు అందిస్తున్న నీటిలో క్లోరినేషన్ చేయడం లేదని ఆయన ఆరోపించారు. నాయకులు మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు జక్కినపల్లి భూమరావు, గుడిసె జితేందర్, కోండ్ర రాంచంద్రారెడ్డి, చెర్ప్యూరి సుభాష్ తదితరులు ఉన్నారు.

గ్రామస్తులు అసభ్యంగా మాట్లాడుతున్నారు..

నల్లానీళ్లు వస్తలేవంటున్నారు : పంపు ఆపరేటర్
నీళ్లురాకుంటే ప్రత్యామ్నాయం చూసుకోవాలి : మిషన్ భగీరథ అధికారి
సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన ఇద్దరు ఉద్యోగుల సంభాషణ

సారంగాపూర్(జగిత్యాల): 'సార్.. నల్లానీళ్ల వస్తలెవ్వని తుంగూర్ గ్రామస్తులు నన్ను కోప్పడుతున్నరు.. అక్కడితో ఆగకుండా అసభ్యంగా మాట్లాడుతున్నరు.. ఎలాగైనా నీళ్ల వచ్చేలా సూడుండ్రి' అని పంపు ఆపరేటర్ ఒకరు మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారికి ఫోన్ ద్వారా తన గోడు వెళ్లబోసుకున్నాడు. అయితే, మిషన్ భగీరథ పథకం ద్వారా నీళ్ల రాకపోతే గ్రామపంచాయతీలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తమకు ఊరికే ఫోన్లు చేసి ఇబ్బంది పెట్టవద్దని ఆ అధికారి సమాధానం చెప్పడం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

15రోజులుగా తాగునీటి సరఫరా బంద్

- బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి 15రోజులుగా మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా కావడంలేదు.
- అప్పుడప్పుడు వచ్చే కొద్దిపాటి నీరుకూడా ప్రెషర్ లేక వాటర్ ట్యాంకుల్లోకి చేరడం లేదు.
- దీంతో తమకు నీళ్ల రావడం లేదని గ్రామస్తులు తనను ఇష్టారీతిన దూషిస్తున్నారని పంపు ఆపరేటర్ ఇటీవల మిషన్ భగీరథ అధికారి దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లాడు.
- సాయంత్రమైతే కొందరు మద్యం తాగి ఫోనులో తిడుతున్నారని ఆవేదన చెందాడు.
- స్పందించిన మిషన్ భగీరథ అధికారి.. మిషన్‌భగీరథ నీరు రాకుంటే.. గ్రామ గ్రామపంచాయతీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.
- మిషన్ పంపులు సరిగా పనిచేయడం లేదని, ప్రస్తుతం మరమ్మతుల్లో ఉన్నాయని, కొత్తవి బిగించడానికి మరికొద్ది రోజుల సమయం పడుతుందని చెప్పారు.
- కొన్నిచోట్లకు ఒకరోజు, మరికొన్ని ప్రాంతాలకు మరోరోజు తాగునీరు సరఫరా చేస్తున్నామని ఆయన వివరించారు.
- కొద్దిరోజులు ఓపికపట్టాలని మిషన్ భగీరథ అధికారి సూచించారు.
- కొత్త పంపులు బిగించడానికి ఉన్నతాధికారులకు విన్నవించామని, త్వరలో అవి వస్తాయన్నారు.
- మరోవైపు.. తమ గ్రామానికి తాగునీటి సరఫరా పునరుద్ధరించి తమ దాహం తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పద్మశాలీలు సంఘటిత శక్తిగా మారాలి

- మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి



మాట్లాడుతున్న మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి, వేదికపై పలువురు ప్రముఖులు

కోరుట్ల: మనమంతా సంఘటితమైతే ప్రబలశక్తిగా మారుతుందని మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన తెలంగాణ పద్మశాలీ ఆత్మగౌరవ సన్నాహక సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అద్భుతాలు సృష్టించడానికి సంకల్పం కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్‌బాపూజీ స్ఫూర్తిగా సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదగడానికి ఎక్కడ అవకాశాలు ఉన్నా పద్మశాలీలు ఇతర బీసీ కులస్తులను కలుపుకుని ముందుకు సాగాలని ఆయన కోరారు. రాష్ట్ర శాసనసభలో ఒక్క పద్మశాలీ ఎమ్మెల్యే లేకపోవడం శోచనీయమన్నారు. సంఖ్యాబలం ఉండటం ముఖ్యం కాదని, దాన్ని సంఘటితం చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ ఆత్మగౌరవ సన్నాహక సభ స్ఫూర్తిగా తెలంగాణలోని అన్నిజిల్లాలకు చెందిన పద్మశాలీలు రాజకీయంగా ఎదగే యత్నాలను ముమ్మరం చేయాలని ఆయన కోరారు. పద్మశాలీ ఆత్మగౌరవ సభ రాష్ట్ర చైర్మన్ బస్వపురం లక్ష్మీనర్సయ్య, పద్మశాలీ సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీరామ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ మాట్లాడారనీ కార్యక్రమంలో నాయకులు గడ్డం మధు, బొగ వెంకటేశ్వర్లు, జిల్లా ధనుంజయ్, సాంబారి ప్రభాకర్, యాదగిరి, గుంటుక విష్ణు, వాసం భూమానందం, రాపెల్లి సురేశ్, రుద్ర రాంప్రసాద్, గుండేటి రాజశేఖర్, చెన్న విశ్వనాథం, ఆడెపు మధు, ఎంబేరి నాగభూషణం, దాసరి రాజశేఖర్, సదుబత్తుల హరిప్రసాద్, గుడ్ల మనోహర్, రుద్ర సుధాకర్, ముల్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బల్బీర్‌సింగ్


మాట్లాడుతున్న బల్బీర్‌సింగ్

ధర్మపురి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సర్దార్ బల్బీర్‌సింగ్ కోరారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పట్టణంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల సందర్భంగా బూత్ లెవల్ నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నార. ఇందుకోసం ప్రతీకార్యకర్త కృషి చేయాలని కోరారు. తుమ్మెనాల, నేరెళ్ల, బుద్దేశ్‌పల్లె తదితర గ్రామాల్లోని శక్తికేంద్రాల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు ఆకుల శ్రీనివాస్, బెజ్జారపు లవన్‌కుమార్, సంగెపు గంగారాం, ఓరుగంటి చంద్రశేఖర్, ఎంపీటీసీ ఆకుబత్తిని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.